ఆదివారం । 15 । జనవరి । 2023

న్యూస్‌రీల్

17న శివమల్లన్న ఆలయంలో వేలం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయ జాతర ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 17న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాల్, చైర్మన్ రాజేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతరలో కొబ్బరికాయలు, ప్రసాదాలు, తైబజార్, పాలుపత్రి విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణ, వాహనాల పార్కింగ్, బియ్యం, బెల్లం విక్రయ హక్కుల కోసం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలను డిపాజిట్‌గా చెల్లించాలని తెలిపారు.

ఘనంగా గోదారంగ నాథుల కల్యాణం


కల్యాణానికి హాజరైన భక్తులు

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని కాపువాడలోగల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదారంగనాథుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు పతంగుల పోటీలు

కాగజ్‌నగర్ టౌన్: ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని సర్‌సిల్క్ వెల్ఫేర్ సొసైటీ సెంటర్‌గ్రౌండ్‌లో పతంగుల పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినాన పతంగులను ఎగురవేసి ఉత్తరాయణ పుణ్య కాలానికి స్వాగతం పలకాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ శివ పంచయతన క్షేత్రంలో ఆర్యవైశ్య, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గోదారంగ నాథుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

వివేకానంద విగ్రహ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని రామకృష్ణ మఠం (రామకృష్ణ వివేకానంద సెంటర్)లో స్వామి వివేకానంద విగ్రహ నిర్మాణానికి బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వివేకానందుడి స్ఫూర్తితో ముందుకుసాగి భారతజాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో వివేకానంద సెంటర్ అధ్యక్షుడు మోదీ తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ లేక ఉద్యోగ సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్య పరిష్కరించాలన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజీ, డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు అన్నారావు, మారుతి, ప్రశాంత్, బాలకిషన్, సంతోష్, విశ్వనాథ్ తదితరులున్నారు.


కౌటాలలో ముగ్గు వేస్తున్న చిన్నారులు




తలోడిలో ఇంటి ముంగిట ముగ్గు వేస్తున్న మహిళ

భోగభాగ్యాల భోగి

కౌటాల: జిల్లా ప్రజలు శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. వేకువజామునే లేచి భోగి మంటలు వేసుకున్నారు. ఉదయం వాకిళ్లను రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్దారు. ముగ్గుల మధ్య ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలుంచి భోగిపండ్లు, నవధాన్యాలు పోశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు భోగిపండ్లు పోశారు. పలువురు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఇంటింటా సకినాలు, అరిసెలు, గారెలు, స్వీట్లు చేసుకుని ఆరగించారు.


వీర్దండిలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న తల్లిదండ్రులు

పక్కా పూర్తయ్యేనా?


హత్తిని గ్రామంలో బేస్మెట్ దశలోనే నిర్మాణం

దహెగాం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం భావించింది. జిల్లాకు 38 హెల్త్ సబ్‌సెంటర్లను మంజూరు చేసింది. నేషనల్ హెల్త్ మిషన్ కింద ఒక్కో భవన నిర్మాణానికి రూ.16లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. నిర్మాణాలు ప్రారంభించినా అధికారుల పట్టింపు లేని కారణంగా అవి పూర్తి కావడం లేదు. కొన్ని చోట్ల పూర్తయినా వసతులు లేక ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరో రెండు చోట్ల నిర్మాణాలు పునాది దశలోనే నిలిచిపోయాయి. జిల్లాలో హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణాలపై కథనం..

- జిల్లాలో 38 హెల్త్ సబ్‌సెంటర్లు
- ఒక్కోదానికి రూ.16లక్షలు మంజూరు
- నత్తనడకన భవన నిర్మాణ పనులు
- పూర్తి దశకు చేరినవి 16 మాత్రమే..
- తొమ్మిది సెంటర్లకు స్థలాలు కరువు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ

తొమ్మిది చోట్ల దొరకని స్థలాలు

నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాలోని 38 హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 29 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 16 చోట్ల పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. మిగతా తొమ్మిది చోట్ల ఇంకా స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు. దహెగాం మండలం హత్తిని, పంబాపూర్ గ్రామాల్లో నిర్మాణాలు ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. పక్కా భవనాలు ఉంటే ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ఉంటే గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందే అవకాశాలు ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

అధికారుల పర్యవేక్షణ లేక..

సబ్‌సెంటర్ భవన నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. స్థలాలు గుర్తించడంలో అధికారుల సమన్వయ లోపంతో ఆలస్యం జరుగుతోంది. ఆయుష్మాన్ భారత్ కింద సెంటర్లకు ప్రభుత్వం వైద్యులను కూడా నియమించింది. సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు లేక వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా చోట్ల అద్దె భవనాల్లో సెంటర్లు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. పక్కా భవన నిర్మాణాలు పూర్తి చేయడంలో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తి చేయించి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.


దహెగాం జిల్లాలో నిర్మాణం పూర్తయినా సౌకర్యాలు లేని భవనం

రెండు నెలల్లోగా పూర్తి చేస్తాం

జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం కింద 38 సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. తొమ్మిదిచోట్ల స్థలాలను గుర్తించే పనిలో ఉన్నాం. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పూర్తయిన భవనాలకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. త్వరలో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకువస్తాం. రెండు నెలల్లోగా అన్నీ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– సందీప్‌రెడ్డి, ఏఈ

ఏళ్లుగా వెట్టిచాకిరే..!


ఎమ్మెల్యే కోనప్పకు వినతిపత్రం ఇస్తున్న ఈజీఎస్ సిబ్బంది (ఫైల్)

- జీతం పెరగలే.. ప్రమోషన్లు రాలే..
- 16 ఏళ్లయినా క్రమబద్ధీకరించలే..
- అరకొర వేతనాలతో అవస్థలు
- ఇబ్బందుల్లో ఈజీఎస్ సిబ్బంది

కెరమెరి(ఆసిఫాబాద్): ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలోనే వారు విధులు నిర్వర్తిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నారు. అయినా ప్రభుత్వం వారిపై కరుణ చూపడం లేదు. అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్ అనే పదం లేకుండా చేస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పుడు ఆ హామీని మరిచిపోయారు. ఫలితంగా గ్రామీణాభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితం అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నో రకాల విధులు నిర్వహిస్తున్న తమపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని వారు ఆరోపిస్తున్నారు.

వినతిపత్రాలు ఇచ్చినా..

గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. రెండు దశాబ్దాలుగా పని చేస్తున్నా వారి వేతనాలు పెంచలేదు. సర్వీస్‌ను క్రమబద్ధీకరించలేదు. ఇతర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగుల కన్నా మిన్నగా వివిధ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నా వేతనాలు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే రూ.15వేల నుంచి రూ.20 వేల వ్యత్యాసం ఉంది. ఏళ్ల తరబడి చాకిరీ చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో పని చేస్తున్న వీరిని ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదే గ్రామీణాభివృద్ధి శాఖలో తమతో పాటు నియమితులైన సెర్ప్ ఉద్యోగులపై చూపుతున్న శ్రద్ధ తమపై చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇటీవల జిల్లా స్థాయిలోని ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

కాంట్రాక్ట్ పద్ధతిన నియామకం

ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని 2006లో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ద్వారా ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా కాంట్రాక్ట్ పద్ధతిలో వీరి నియామకం జరిగింది. ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, జూనియర్ ఇంజినీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ప్లాంటేషన్ మేనేజర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, ప్రోగ్రాం మేనేజర్లు ఇతర 26 కేటగిరీలకు చెందిన ఉద్యోగులు ఉపాధిహామీ విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిన వాటర్‌షెడ్, ఇందిరా జలప్రభ, ఉపాధిహామీ, గిరి వికాసం లాంటి పథకాల అమలుకు వివిధ హోదాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 156 మంది విధులు నిర్వహిస్తున్నారు.

జీతం తక్కువ.. పనిభారం ఎక్కువ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేయడం వీరి ప్రధాన విధి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరంతా పని చేస్తున్నారు. హరితహారం, పల్లె ప్రగతి, పల్లె ప్రకృతి వనాలు, డంప్‌యార్డులు, ధాన్యం కల్లాలు, పశువుల షెడ్లు, చెరువుల్లో పూడిక తీత, రోడ్లకు ఇరువైపులా ప్లాంటేషన్ ఏర్పాటు చేయడం, వైకుంఠధామాల పర్యవేక్షణ, రోడ్లు, నర్సరీల నిర్వహణ, చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే ఇతర పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్, కార్యక్రమాలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఉపాధిహామీ తదితర కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయినా ప్రభుత్వం వీరికి పనికి తగిన వేతనం అందించడం లేదు.

క్రమబద్ధీకరించాలి



ఉపాధిహామీలో విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని క్రమబద్ధీకరించాలి. 16ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నాం. కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేస్తామన్న సీఎం కేసీఆర్ తన హామీని నిలబెట్టుకోవాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

– జీ మల్లయ్య, ఈజీఎస్ ఉద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

‘కంటివెలుగు’కు సర్వం సిద్ధం


జిల్లా ఆస్పత్రిలో కంటివెలుగు సామగ్రి


కంటివెలుగు కళ్లజోడు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా ఆస్పత్రిలో సామగ్రి పరిశీలన

ఆసిఫాబాద్: జిల్లాలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఈ నెల 18న కంటివెలుగు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న సామగ్రిని శనివారం ఆయన పరిశీలించారు. కంటివెలుగు శిబిరాల నిర్వహణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో 26 బృందాలు, ఒక అదనపు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 28 వాహనాలు, 27 ఏఆర్ మిషన్లు, 26 ట్రయల్ లెన్స్ బాక్సులు, 81 స్నెల్ విజన్ చార్టులు, 26 కంటివెలుగు కిట్లు, 52 ట్యూబులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, 30 అర్బన్ ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాల నిర్వహణకు పూర్తి స్థాయి కార్యాచరణతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సంబంధిత అధికారులు పర్యవేక్షించనున్నట్లు వివరించారు.

విద్య, వైద్యంపై శ్రద్ధ చూపాలి


భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న పెద్దలు

కెరమెరి: విద్య, వైద్యంపై శ్రద్ధ చూపాలని రాయిసెంటర్‌లో తీర్మానం చేశారు. శనివారం మండలంలోని జోడేఘాట్ గ్రామపంచాయతీకి చెందిన రాయిసెంటర్ సభ్యులు జోడేఘాట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడాలని, మూఢనమ్మకాలను వీడాలని సూచించారు. అంతకుముందు కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. పెద్దలు పెందోర్ రాజేశ్వర్, ఆత్రం ధర్మూ, కేశవ్‌రావు, ముత్త, రాము, మారు, హన్ను పటేళ్లు, దేవారీలు పాల్గొన్నారు.

ఆర్టీసీకి అదనపు ఆదాయం


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆసిఫాబాద్ బస్టాండ్

ఆసిఫాబాద్: సంక్రాంతి పండగ ఆర్టీసీకి కలిసొచ్చింది. పండగ సందర్భంగా రెండురోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు భారీగా ఆదాయం పెరిగింది. డిపోలో 67 బస్సులుండగా పండగ నేపథ్యంలో రద్దీ ఎక్కువైంది. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌కు ఐదు ప్రత్యేక బస్సులు వేశారు. దీంతో పాటు రద్దీ ఉన్న రూట్లలో బస్సులను నడిపారు. రెండు రోజుల్లో రూ.34.60 లక్షల ఆదాయం సమకూరింది. సాధారణ రోజుల్లో డిపో ఆదాయం సుమారు రూ.12 లక్షలు వస్తుండగా, రెండు రోజులుగా గణనీయంగా పెరిగింది. ఈ నెల 12న రూ.16.90 లక్షలు, 13న రూ.17.70 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం కూడా బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం


మాట్లాడుతున్న డీఈ, ఏడీఈ

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూస్తామని విద్యుత్ డీఈ కైసర్, ఏడీ ఈ ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ అంతరాయంతో దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ శివారులో పొలాలు ఎండిపోవడంతో 'పొలాలు బీటలు' అనే శీర్షికన 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. బీటలు వారిన పొలాలను పరిశీలించారు. రైతులు, విద్యుత్ సిబ్బందితో మాట్లాడారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులు సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏఈ ఈ రాయనర్సు, లైన్‌మన్ రామస్వామి, జేఎల్‌ఎం రాజలింగు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రెబ్బెన: మండల కేంద్రంలో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. పక్కా సమాచారం మేరకు మండల కేంద్రంలో పేకాటస్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. తీన్ పత్తా ఆడుతున్న మండల కేంద్రానికి చెందిన ఏడుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.7,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎదురొస్తున్న ప్రమాదం..!

- ఎదురెదురుగా ఢీకొంటున్న ద్విచక్ర వాహనాలు
- వేగం వల్ల గాల్లో కలుస్తున్న ప్రాణాలు

సాక్షి, మంచిర్యాలడెస్క్: ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి ప్రమాదం ఎదురొస్తోంది. అతివేగం, మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోవడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. గత డిసెంబర్ 25న ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు సంఘటన స్థలంలోనే మృత్యువాత పడడం, మరొకరు ఆస్పత్రిలో చనిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ప్రమాదాల్లో మృతుల సంఖ్యతోపాటు గాయపడుతున్న వారూ అధికంగానే ఉంటున్నారు.

హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనల్లో చాలామంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జరిగింది. రాంగ్‌రూట్‌లో వెళ్లడం, మూలమలుపులు, మద్యపానం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో గత ఏడాది కాలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 3,288మందికి పోలీసులు జరిమానా విధించారు. రూ.4.81లక్షలు జరిమానా రూపంలో వసూలైంది. నిర్మల్ జిల్లాలో హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 1,49,621 మందికి రూ.2,24,43,150 జరిమానా విధించారు. ఆదిలాబాద్ జిల్లాలో 2,307 మందికి జరిమానా విధించి రూ.1,17,232 వసూలు చేశారు. జిల్లాలో పోలీసులు 13బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. నేరడిగొండ మండలం కుప్టి, నేరడిగొండ సమీపంలోని దాబాల వద్ద, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలం పులిమడుగు, జైనథ్ మండలం భోరజ్, మావల సమీపంలోని బైపాస్, దేవాపూర్ చెక్‌పోస్టు తదితర ప్రాంతాలు ఉన్నాయి.


భీంపూర్ మండలం లక్ష్మీపూర్ వద్ద జరిగిన ప్రమాద స్థలంలో క్షతగాత్రులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు..

- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై గత జూలై 11న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. హాజీపూర్ గ్రామానికి చెందిన మల్యాల వంశీ(20) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఈ ప్రమాదంలో వంశీ మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇదే ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకులు చింతకింది శ్రీధర్, అలిశెట్టి రవికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందినవారు.
- తాంసి మండలం హస్నాపూర్ గ్రామ సమీపంలో డిసెంబర్ 25న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే నలుగురు మృతిచెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.. సుజిత్‌రామ్(38), మనీషా(11), నారాయణ(30), సంస్కార్(11) మృతిచెందారు. వందన అనే మహిళ గాయపడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వారు హెల్మెట్లు ధరించలేదు.
- జనవరి 9న భీంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గుబిడిపల్లెకు చెందిన చిర్ర మల్లన్న, రాజారాం, మహారాష్ట్రలోని కొఠారికి చెందిన రంజిత్‌చౌహాన్, రమేశ్‌యాదవ్ గాయపడ్డారు.
- జనవరి 9న ముథోల్ మండలం టాక్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన సాయిలు (35) అక్కడికక్కడే మృతిచెందాడు. నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన రాజశేఖర్ గాయపడ్డాడు.
- ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడ సమీపంలో గతేడాది ఫిబ్రవరి 28న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని గుండవేణి ప్రసాద్ గాయపడ్డాడు. అక్టోబర్ 20న రాంపూర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో కాల్వ మల్లేశ్ గాయపడ్డాడు. మే 20న జరిగిన ప్రమాదంలో షేక్ ఆరీఫ్ (50) మృతిచెందాడు. వీరి వాహనాలకు ఎదురుగా వాహనాలపై వచ్చిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
- జనవరి 10న మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాలపై ఎదురెదురుగా వస్తున్న బాసర గ్రామానికి చెందిన శివ తీవ్రంగా, మహారాష్ట్రకు చెందిన సంక్షేణ స్వల్పంగా గాయపడ్డారు.

హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలి



మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. యువత చైతన్యంతో నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మితిమీరిన వేగం, నిబంధనలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే పోలీసు, రవాణా శాఖల సమన్వయంతో రెడ్ జోన్, బ్లాక్‌స్పాట్స్ గుర్తించడంతోపాటు మూలమలుపులు, ఇరుకు వంతెనల వద్ద జాగ్రత్తలు సూచించాం. వాహనదారులు జాగ్రత్తలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో జాగ్రత్తలు సూచించాలి. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనల్లో హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు పాటించాలి.

– ఎల్.కిష్టయ్య, జిల్లా రవాణాశాఖ అధికారి, మంచిర్యాల

ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ద్విచక్ర వాహనాలతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపిస్తుండడంతో ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో గుర్తించేలా ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల వెనుక రేడియం వేయించేలా చూస్తున్నాం. ఆదిలాబాద్ పట్టణంలో రోడ్లపై పశువుల సంచారంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పది రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతో ప్రమాదాలు జరగడలేదు. నిబంధనలు పాటించని 300 మందిపై కేసులు నమోదు చేశాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎస్పీ

బాలికపై లైంగికదాడి?

- పోలీసుల అదుపులో అనుమానితుడు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక లైంగిక దాడికి గురైనట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వీర్దండి గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. కూతురు అస్వస్థతతో ఉండగా ఆరా తీశారు. ఆమె ద్వారా వివరాలు తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. శనివారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ బుద్దే స్వామి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ ఘటనకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై వివరాలు తెలిపేందుకు పోలీసులు నిరాకరించారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబాపూర్ గ్రామానికి చెందిన మేకల సంతోష్ (37) ఇటీవల భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో ఈనెల 9న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన కుచ్చుల శ్రీహరి (36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లికి చెందిన శ్రీహరికి 15ఏళ్ల క్రితం సుమలతతో వివాహమైంది. వారం కిత్రం కుటుంబంలో గొడవలు తలెత్తగా సుమలత పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీహరి క్షణికావేశంలో శుక్రవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం బాపు (50) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో అప్పుల పాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 12న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య తిరుపతక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మామిడి తోటలను సంరక్షించుకోవాలి


తిరుపతి, హెచ్‌వో


మామిడి తోట

చెన్నూర్‌రూరల్: ఏటా అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో మామిడి కాయలు నేల రాలడం, కాయలు దెబ్బతిని మామిడి రైతులు తీవ్ర నష్టాలకు గురవుతూనే ఉన్నారు. ప్రకృతి ప్రకోపంతో లక్షల రూపాయలు నష్ట పోతున్నారు. మామిడి తోటల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. లేదంటే కాయలు దెబ్బ తిని దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఉదయం, రాత్రివేళల్లో చలి, మధ్యాహ్నం అంతా వేడిమి ఉంటుంది. ఎండల బారి నుంచి పండ్ల తోటలను రక్షించుకోవడంపై రైతులు దృష్టి సారించాలని హెచ్‌వో తిరుపతి సూచించారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, గాలిలో తేమ శాతం తగ్గుముఖం పట్టడం వల్ల పండ్ల తోటల్లో కాయలపై పొడలు ఏర్పడి పెరుగుదల తగ్గిపోవడం, నాణ్యత దెబ్బ తినడం జరుగుతుంది. నాణ్యత లోపించిన కాయలకు మార్కెట్‌లో ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి ఎండలు, వేసవిలో పండ్ల తోటల్లో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎండలు పెరిగే కొద్దీ పిందెలు, కాయలపై ప్రభావం ఎక్కువగా పడుతుంది. ఎండ వేడిమికి కాయలు దెబ్బతిని పెరుగుదల, నాణ్యత తగ్గిపోతుంది. ఎండ సోకిన ప్రాంతంలో కాయకు గుంత పడుతుంది. చాలా సందర్భాల్లో 20 నుంచి 30 శాతం వరకు కాయలు ఎండ తీవ్రత వల్ల దెబ్బతింటాయి. ఇందులో బంగినపల్లి, నీలం, తోతాపరి, పలు రకాల కాయలకు ఎండ బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో కాయల్లో లోపలి భాగంలో కోతకు మునుపే మచ్చలు ఏర్పడి లోపలి కణజాలం కుళ్లుతుంది. ఇవి చాలా వరకు రాలిపోతాయి. 20ఏళ్లలోపు వయస్సున్న తోటల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

నివారణ ఇలా..

పిందెలు గోలి సైజులో ఉన్నప్పుడు ఒకసారి, నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు రెండోసారి లీటర్ నీటికి 20 గ్రాముల సున్నం, అర మిల్లీ లీటర్ జిగురు కలిపిన ద్రావణాన్ని పిందెలు, కాయలపై సన్నటి పొర ఏర్పడేలా పిచికారీ చేయాలి. ఇలా చేస్తే సరిపోతుంది. రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. కాయల ఎదుగుదల లోపించినా, ఎండ తీవ్రతకు మచ్చలు ఏర్పడి కాయల్లో ఏమైనా తేడాలు కనిపించినా వెంటనే ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సత్వర నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

చింతలమానెపల్లి: డబ్బా గ్రామ శివారులో శనివారం కోడి పందేలు ఆడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.1,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కౌటాల: మండలంలోని సాండ్‌గాం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. రెండు కత్తులు సీజ్ చేశారు. రెండు కోళ్లు, పలు ద్విచక్రవాహనాలు, రూ.6వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పందేల్లో పాల్గొన్న తొమ్మిదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ఘటనా స్థలంలో మదర్

వాంకిడి: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన ఎస్కే మదర్, పల్లికొండ భీమయ్య ద్విచక్రవాహనంపై శనివారం మహారాష్ట్ర వైపు నుంచి వాంకిడి వైపునకు వస్తున్నారు. ఈ సమయంలో మండలంలోని ఆర్టీవో చెక్‌పోస్ట్ సమీపంలో ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. వాహనం నడుపుతున్న భీమయ్యకు స్వల్ప గాయాలు కాగా, వెనుక కూర్చున్న ఎస్కే మదర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై డీ సాగర్ తెలిపారు.

వివాహిత బలవన్మరణం


సాయి వినూత్న (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన వివాహిత సాయివినూత్న(22) బలవన్మరణానికి పాల్పడింది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లడ్ కాలనీకి చెందిన సాయి వినూత్నకు దేవాపూర్‌కు చెందిన సాయితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దికాలం తర్వాత భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో గత నవంబర్‌లో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. కొంతకాలంగా సాయి వినూత్న ఇంట్లో ఒంటరిగా, ముభావంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లోని బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి వినోద్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్‌లొద్దీ గ్రామంలో ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ధర్‌లొద్దీ గ్రామానికి చెందిన వివాహిత పార్వతీబాయి(23) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికుల కథనం ప్రకారం.. పార్వతీబాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా ఈఎంటీ కార్తీక్‌సింగ్, పైలట్ రాములు ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం


సర్ఫ్ నీళ్లు తాగిస్తున్న స్థానికులు

భీమారం: మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి చింతపూడి అంజి(20) శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంట్లో గొడవపడి అకస్మాత్తుగా క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు స్పందించి పురుగుల మందు బయటకు వచ్చేలా సర్ఫ్ నీళ్లు తాగించారు. అనంతరం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

16న రాష్ట్ర స్థాయి సమావేశం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఈ నెల 16న ఉట్నూర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉన్నత స్థాయి ఉద్యోగులు, హైదరాబాద్, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి హాజరవుతారని, పర్ధాన్ ఉద్యోగుల సంఘం బలోపేతం చేయడం, భవిష్యత్‌లో సంఘం నిర్వహించే కార్యక్రమాలు, సమాజానికి చేయాల్సిన సేవ వంటి ముఖ్యమైన ఎజెండాతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బెల్లంపల్లి వాసికి అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న కుమారస్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రడగంబాల బస్తీకి చెందిన దుర్గం కుమారస్వామిని ఇంటర్నేషనల్ అకాడమిక్ ఎక్స్‌లెంట్-22 అవార్డు వరించింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కుమారస్వామి ఇంజినీరింగ్ విద్యలో విద్యార్థులకు అందించిన సేవలు, వివిధ జర్నల్స్‌లో ప్రచురితమైన ఆర్టికల్స్‌కు గాను నీతి ఆయోగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో అవార్డును ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం అవార్డు, మెడల్‌ను కుమారస్వామి అందుకున్నారు. కుమారస్వామిని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.